# అందని ఉత్తరం

లక్ష్మీ శ్రీనివాసన

రాత్రి ఎనిమిదయింది.

గోల్డ్ మార్కెట్ సెంటరులో మెర్క్యురీ లైటు దేదీప్యమానంగా వెలుగుతోంది. సెంటరు నలువైపులా బట్టలషాపుల్లో వున్న బొమ్మలకు ప్రాణంవచ్చి గిర్రున తిరుగుతున్నాయి. ఫుట్‌పాత్ మీదున్న పూల అంగళ్ళలో రాసులుగా పోసిన చామంతిపూలు తమ పరిమళాన్ని చాలాదూరం వ్యాప్తిచేస్తున్నాయి. అగరువత్తుల కొట్లో అమీర్‌సాహెబ్ వెలిగించిన "సుగంధి" అగరుబత్తీల సువాసన ఆ చుట్టుప్రక్కల వున్నవాళ్ళకు మత్తును కలిగిస్తోంది.

సెంటరు మధ్యలో బలంగావున్న బీట్ కానిస్టేబుల్ ఓ బక్కచిక్కిన రిక్షావాణ్ణెందుకో బండబూతులు తిడుతున్నాడు. ఎన్నో బెల్‌బాటమ్ శాల్తీలు చూపులను తమ ఆకర్షణలతో పిచ్చెక్కిస్తున్న సుతిమెత్తని శరీరాలు — నవ్వుతూ, తుళ్ళుతూ అటూ ఇటూ తిరుగుతున్నాయి. ఏవో ఆలోచనలతో, ఏడుపు మొహాలతో కొందరు పరధ్యాన్నంగా నడుస్తున్నారు.

పుట్టిన పిల్లలు తల్లి పాలకోసం నిరీక్షణ —
వయసొచ్చాక పెళ్ళి కోసం నిరీక్షణ —
రెండు బ్రతుకుల కలయికలో కన్నకలలు నిజంకావాలని నిరీక్షణ —
పండిపోయాక పరలోక ప్రాప్తి కోసం నిరీక్షణ —
ఇలాగే ఈ లోకం నడుస్తోందా?

నరసింహారావు పున్నయ్య పూల కొట్టు దగ్గర ఓ ప్రక్కగా నిలబడి అప్పారావు కోసం నిరీక్షిస్తున్నాడు. అప్పుడే రెండు గంటల నుంచి ఆ నిరీక్షణ! అతని సహనాన్ని అప్పారావు పరీక్షిస్తున్నాడు. గడుస్తున్న ప్రతిక్షణం అతనిలో అసహనం పెరుగుతోంది!!

ఆరు గంటలకు డ్యూటీ దిగిపోతూ అప్పారావు నతడు పది రూపాయలు అప్పు అడిగాడు. అడగ్గానే నరసింహారావుసునఖశిఖ పర్యంతంపరీక్షగాచూశాడు అప్పారావు. అతనలా చూడ్డానికి కారణం లేకపోలేదు.... ఆ నెలలో నరసింహారావు అప్పటికి రెండు సార్లు అతడివద్ద యాభై రూపాయలు అప్పు తీసుకున్నాడు. అయిదారు రోజుల క్రితం మళ్ళా మూడోసారి ఏదో పూజ వెళ్ళాలంటూ పాతిక రూపాయలు అడిగేసరికి అప్పారావుకు కోపం ముంచుకొచ్చి "మా ఇంట్లో రూపాయల చెట్టు లేదయ్యా" అని నిర్మొహమాటంగా చెప్పేశాడు.

అప్పు యిచ్చేవాడికి పౌరుషం ఉండటం ఎంత సహజమో—అప్పు అడిగేవాడికి సిగ్గు లేకపోవడం అంతకంటే సహజం గనుక ఆ వేళ మళ్ళీ పది రూపాయలు అప్పు అడగ్గలిగాడు నరసింహారావు.

అప్పారావు ఏ కళనున్నాడో, ఏమనుకున్నాడో.... అతడిముఖంలోకిచూసి ఆ రోజు ఏమీ అనలేకపోయాడు. నరసింహారావుకున్న కష్టనష్టాలన్నీ అతనికి తెలుసు. అతను అప్పు తీసుకొంటే- అది తనకివ్వవలసిన మొత్తంలో కలుపుకోవడమేననీ తెలుసు—అదంతా జ్ఞాపకం వచ్చి "పాపం.... ఏవో ఇంటి యిబ్బందులు.... ఏ యిబ్బందులూ లేకపోతే ఎవరూ అప్పు చెయ్యరు" అనుకొని జాలిపడ్డాడు. అతని కళ్ళను న్న ప్రాణాల్నిచూసి బాధపడ్డాడు. "ఇలా బాధపడుతున్నానేమిటా" అని ఆ వెంటనే భయపడ్డాడు.

ఈ జాలి, బాధల్లాంటి బరువైన మాటలు జ్ఞాపకంవస్తే తన వ్యాపారం సాగినట్టే! అప్పారావు ముఖంలోకి అకస్మాత్తుగా కాఠిన్యం వచ్చేసింది. ఒకసారి జేబులు తడుముకొని "ఇస్తాను—యివ్వను" అన్న





మాట ఖచ్చితంగా చెప్పకుండా "పున్నయ్య పూలకొట్టు దగ్గర వుండు. ఎనిమిది గంటలకు వస్తాను" అంటూ వెళ్ళిపోయాడతను. అతని దగ్గర సిద్ధంగా డబ్బు లేదని నరసింహారావుకు అర్థమైంది.

అప్పారావు డబ్బంతా వూళ్ళో వున్న చిన్న చిన్న కిళ్ళీ కొట్టుల్లోనూ, బజ్జీలు అమ్ముకునే బళ్ళలోనూ, బార్బర్ షాపుల్లోనూ, కాకా హోటళ్ళ మీదా వుండిపోతుంది. మొత్తం మీద చెప్పాలంటే వూళ్ళోవున్న చిన్న వ్యాపారస్థు లందరికీ అప్పులిచ్చే అప్పారావంటే అట్లు అమ్ముకునే అప్పాయమ్మకు కూడా తెలుసు.

అతను డ్యూటీ దిగ్గానే వూరుమీద పడిపోయి పాపం పుణ్యం ప్రక్కకు నెట్టేసి, ఆ వేళ కలెక్షన్లు వసూలు చేసుకొని, అది మరి కొందరి వ్యాపారాభివృద్ధికోసం పెట్టుబడి పెట్టి ఎనిమిదయేసరికి పున్నయ్య పూలకొట్టు వద్దకు చేరుకుంటాడు.

ఆ విధంగానైనా కొంతమందికి బ్రతుకు దారి చూపిస్తున్న అప్పారావును చూస్తే పూలకొట్టు పున్నయ్యకు పరమసంతోషం!

ఎందుకంటే .... ఆ పూలకొట్టు అతని డబ్బుతోనే ప్రారంభించి, ఇప్పుడు అప్పారావు వ్యాపారంలో భాగస్వామికూడా కాగలిగాడు గనుక!

ఆవేళ ఇంకా చేరుకోని అప్పారావు కోసం ఇంతింత కళ్ళు చేసుకొని, యింట్లో పరిస్థితుల్ని తల్చుకొంటూ తల్లడిల్లుతున్న మనసుతో, తలుపుకొస్తున్న బాధలతో ఎదురు చూస్తున్నాడు నరసింహారావు. అతని కళ్ళముందు నుంచి జిగేల్ మనిపించే జవరాండ్రెందరో పూలు కొనుక్కొని కదలిపోతున్నారు. ఎటువైపు చూసినా తళతళలతో, మిలమిలలతో ఎంతో అందంగా వుంది ప్రదేశం. వుండుండీ ఖరీదైన కారు హారన్ల మోత కర్ణేంద్రియాల్ని అదరగొడుతోంది. అయినా అతడివేమీ పట్టించుకోవడంలేదు. పట్టించుకో నివ్వని వ్యధాపూరితమైన ఆలోచనలెన్నో అతడి మస్తిష్కంనిండా ముసురుకుంటున్నాయి.

తాయారు సహచర్యంతో అతని సంసార జీవితం మొదలై యిప్పటికి పన్నెండు సంవత్సరాలైంది. పని చేస్తున్నచోట మూడొందలు మించి ఆదాయం పెరగలేదు. ముగ్గురు పిల్లలు మాత్రం తయారయ్యారు. ఆదాయాన్ని మించిన అవసరాలు—'నా' అనుకునే పెద్ద నాన్న, భార్య తరపువారూ అతనికి చేయూతనిచ్చి యిచ్చి విసిగిపోయారు. కనీస అవసరాలు తీర్చుకోవడం తప్పక....వస్తులుండలేక డ్యూటీ పూర్తి కాగానే అగ్గిపెట్టెలూ, సిగరెట్లూ, వక్కపొడీ వగైరాలు కొట్టు కొట్టుకూ రాత్రి పన్నెండు అయేవరకూ తిరిగి అమ్మేవాడతను. ఫలితం కనిపించినట్టే కనిపించి మూణ్ణెల్లు మంచం ఎక్కించిందతన్ని- మూడొందలు అప్పు. కృశించిపోయిన శరీరం. ఆ శరీరాన్ని ఒదిలిపెట్టడానికిష్టంలేని ప్రాణం మిగిలాయి. మళ్ళీ ఆ పని జోలికి పోలేదు. తాయారు అతన్ని పోనీయలేదు. అవసరానికి అప్పులు చేయడం తప్పనూ లేదు.

నరసింహారావు బరువుగా, బాధగా నిట్టూర్చాడు. ఇంట్లో అన్నీ అయిపోయినా యింకా ఒకటో తారీఖు మూడురోజులుంది. యిరవై రోజులుగా విషజ్వరం గుప్పిటిలో చిక్కుకొని చిక్కి శల్యమై మందులకనీ—మాకులకనీ తనను పీల్చి పిప్పిజేసి ఇప్పుడిప్పుడే తేరుకొంటూంది తాయారు. యిస్త్రీ బట్టల్లేక "యిన్సల్ట్"గా వుంటుందని స్కూలు మానేస్తానంటున్నాడు చిట్టిబాబు. వద్దు.... వద్దు అంటున్నా పయస్సు మీదికి తెచ్చేసుకుంటున్నారు ఇద్దరాడపిల్లలు.... చాలీచాలని జీతం. తరుగుతున్న వయసు. పెరుగుతున్న అప్పులు. ఇలా తల్చుకుంటే మతి చెడిపోతుంది! మనోధైర్యం పారిపోతుంది. ఏదో అయిపోతుంది— ఏదో జరిగిపోతుంది. "ఈ పాటి సంపాదన లేనివాళ్ళు .

గంజి త్రాగడానికి నోచుకోనివాళ్ళు ఎంత మంది లేరు" అనుకుంటూనే అతను ఆలోచించకుండా వుండలేకపోతున్నాడు.

ఎవరో ప్రేమమూర్తి ప్రేయసికి పూలు కొని తీసుకెళ్ళడానికొచ్చాడు. "టైమెంతండీ ?" అన్నాడు నరసింహారావు అతని చేతి వాచీవైపు చూస్తూ. "ఎనిమిదింబావు" అన్నాడతను.

ఎదురుచూస్తూ వుంటుంది తాయారు. ఉదయం గుమ్మం దాటుతుంటే "నోరు బావుండలేదండీ. ఒక్క యాపిల్ కాయ కొని తెద్దురూ!" అంది. అతను ఆగి ఆమెవైపు ఒక్క క్షణం చూశాడు.

"ఆనక వచ్చేటప్పుడు ఎన్నో కొన్ని బియ్యం, కాయగూరలు, ఆ చేత్తోనే పంచదార కూడా తీసుకురండి. బెల్లం టీ త్రాగుతుంటే వికారం విపరీతంగా వచ్చేస్తుంది!" అంది.

మాటలు రాని మూగవాడు కాడు గనుక "అలాగే" అనడం అతనికి పెద్ద కష్టం కాలేదు. అదీగాక ప్రతి మాటకూ అలాగే అనడం అతనికో అలవాటుగా పరిణమించింది.

"శరీరం కప్పుకోడానికో సరైన చీరలేక సిగ్గుతో చచ్చిపోతున్నానండీ!" అని తాయారంటే "అలాగే" అంటాడు. "ఆడపిల్లలు ఎదుగుతున్నారండీ! వీళ్ళకి మనం పెళ్ళి చెయ్యగలమా?" అన్నా అదే మాట! "చిట్టిబాబు టైముకు యింటికి రావడంలేదండీ!" అన్నా ఆ మాటే—అందుకని అతనికి వేరే మాటలు రావనికాదు.

పెళ్ళయిన కొత్తలో "తాయారూ నువ్వో అపరంజి బొమ్మవు!" అంటూ ఆకర్షణీయమైనమాటలతో ఆమెను ఆకాశానికెత్తేశాడు. "నిన్ను ప్రేమ సింహాసనంమీద కూర్చోబెడతాను తాయారూ!" అని ప్రేమపూర్వకమైన వాగ్దానాలూచేశాడు. ప్రస్తుత పరిస్థితిలో వాటిని తల్చుకోడానికే భయపడిపోతున్నాడతను.

అయితే ఇప్పుడా వాగ్దానాలతోను, ఆకర్షణీయమైన మాటలతోనూ నరసింహారావుకు పనిలేదు. ఆమె చెప్పినవి అతడు పట్టుకెళ్ళక పోయినా తాయారు తిట్టదు .... కొట్టదు. నువ్వు నా మొగుడివికాదు అనదు. కనీసం యాపిల్ అయినా తెస్తాడని ఆశతో ఎదురు చూస్తుంటుంది- అంతే! అందుకే అతను బాధపడుతున్నాడు. ఆమె ఒంట్లో రక్తం పట్టడానికి తెమ్మనలేదు. తిన్నది అరగడానికని అడగలేదు. ఇరవై రోజులుగా జ్వరంతో నోరు చచ్చిపోయి- రుచి మర్చిపోయిన నాలుక కోరిన మానవ సహజమైన కోరిక... కనీసం అదికూడా నెరవేర్చే అవకాశం లేదా ?

ఆవిడేమీ చీరలు కొనలేదని గోల చెయ్యడం లేదు. చిరిగిన బట్టలు కట్టుకుంటున్నందుకు సిగ్గుపడుతుందే తప్ప చింతపడ్డంలేదు. చింకిచాపే శరణ్యమైనందుకు చీదరించుకోవడంలేదు. విసుక్కున్నా, కసురుకున్నా, వీపుచిట్లగొట్టినా నిన్నొదిలిపోతాననడం లేదు. తను ప్రేమించలేకపోతున్నా ఆవిడ తన ప్రేమ చంపుకోవడంలేదు. ఏమైనా పతివ్రతా ధర్మాన్ని నిలబెట్టుకుంటూనే వుంది.

ప్రేమ....ముగ్గురు పిల్లలు పుట్టగానే అతడిలో ప్రేమ ఎగిరిపోయింది. వికటిస్తున్న పరిస్థితులతో పోటీపడలేక ప్రేమ ఎప్పుడో చచ్చిపోయింది. ఇప్పుడతనికి మిగిలివున్నది బాధ్యత! పోనీ బాధ్యతలనైనా సక్రమంగా నిర్వహించాలనుకుంటే వుండుండీ బండరాళ్ళవంటి దెబ్బలు సూటిగా గుండెలకు తగులుతున్నాయి. ఒక నెల కాదు. ఒక సంవత్సరంకాదు....కొన్ని సంవత్సరాలనుంచి ఇదే వరస....వీటికి అంతం ఎప్పుడు ?

అప్పుడే ఏటిమొగ సిటీబస్సు గ్యాసు హారను మ్రోతతో గుండెలదరగొడుతూ వెళ్ళిపోయింది అంటే టైము ఎనిమిదిన్నర. అప్పారావు వరాకపడ్డాడా? బియ్యం వగైరాల మాటెలావున్నా జ్వరంతో నోరు చచ్చిపోయి వున్న తాయారు అతి చిన్న కోరికైనా తీర్చాలని అలాగే ఓర్పుతో అప్పారావు కోసం ఎదురు చూస్తున్నాడు నరసింహారావు.

పాపుతక్కువ తొమ్మిదైనా అతను రాలేదు. రోడ్డుమీద తిరిగేజనం పలచబడ్డారు. బీట్ కానిస్టేబుల్ సెంటరునొదిలేసి యింటికెళ్ళిపోయాడు. బట్టలషాపులు మూసేస్తున్నారు. చామంతిపూల పరిమళాన్ని చీకటి కొట్లో దాచేస్తున్నారు. అమీర్ సాహెబ్ అగరుబత్తీల మత్తునుంచి విముక్తిని కలిగించే ప్రయత్నం చేస్తున్నాడు.

తొమ్మిది గంటలకు నిరీక్షణ ముగించి, నిరాశతో అక్కడ్నుంచి కదిలాడు నరసింహారావు. నమ్మకంగా చెప్పి నమ్మకొనివున్న తనని దగా చేశాడు అప్పారావు. అతనిమీదే ఆశపెట్టుకున్నందుకు తగినశాస్తి చేశాడు. ఆఫీసులో వుండే అనంతయ్య నడిగినా రెండు రూపాయలు యిచ్చి వుండేవాడేమో! ఎవరిస్తారు ? పిచ్చిగాని....తనంటే అందరికీ భయమే....ఇలా తలపోసుకుంటూ వంతెనమీది కొచ్చాడు నరసింహారావు. తిరిగి అలసిపోయిన అప్పారావు తనమాట మర్చిపోయి వంతెనమీద చల్లగాలి పీల్చుకుంటున్నాడేమోనని అతని కళ్ళు ఆ చుట్టు ప్రక్కల ఆత్రుతగా వెదికాయి. అప్పారావు ఎక్కడా కనిపించలేదు. అతనక్కడే కాస్సేపు నిలబడ్డాడు.

వంతెన క్రింద నీరు వింత శబ్దాలు సృష్టిస్తూ వేగంగా ముందుకు ప్రవహిస్తోంది. నీలాల నింగిలోని నెలరాజు నీటిలో ప్రతిబింబిస్తూ, పగలబడి నవ్వుతో, అలలపై ఉయ్యాల లూగుతున్నాడు. వంతెన సమీపంలోఏరుప్రక్కనేవున్న ఏడుకొండలవాడి ఆలయం వెన్నెట్లో ఎంతో అందంగా అగుపిస్తోంది. చాలాసేపు అప్పారావు కోసం చూసి చూసి విసిగిపోయాడు నరసింహారావు. భార్య కోరిన యాపిల్ కాయ కూడా కొని తీసుకెళ్ళలేని తన అసమర్థతను నిందించుకొంటూ ఇంటి ముఖం పట్టాడు.

అతనిల్లు చేరేసరికి వీధి అరుగుమీద కూర్చొని, ఏదోపుస్తకం తిరగేస్తూ ఆనందరావు కనిపించేడు. అతన్ని చూడగానే నరసింహారావు గుండె ఝల్లుమంది!

ఆనందరావు — నరసింహారావు తండ్రి తోడల్లుడి కొడుకు. అతడు సామాన్యంగా ఎక్కడికీ రాడు. నరసింహారావు ఉద్యోగం చేస్తున్న తొలి రోజుల్లో ఆనందరావు అతని దగ్గరే వుంటూ — ఓ డాక్టరుగారి దగ్గరచేరి వైద్యం చేయడం ఎలాగో వంటబట్టించుకున్నాడు. అతనిప్పుడుంటున్నదో మారుమూల పల్లె. అక్కడున్నవాళ్ళకు డాక్ట

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
విరేపనముతో
చికిత్సను పొందండి
- శస్త్రచికిత్స
అవసరములేదు!

సహించలేని బాధ ఉందా? తీవ్రంగాదురద వుందా? మంటతో నెత్తురు పడుతుందా? అమోఘమైన చికిత్స, ఎంతమాత్రము కాలయాపన చేయవద్దు! ఉపేక్షిస్తే తీవ్రమైన పరిస్థితులకు దారి తీసి-శస్త్రచికిత్స తప్పనిసరి ఔతుంది. సకాలంలో హెడెన్‌సాతో ఉపశమనాన్ని పొందండి. ఇది నమ్మకమైన జర్మను మూలశంక విరేపనము. 108 దేశాలలో వైద్యులందరూ శిఫారసుచేస్తున్నారు! హెడెన్‌సాలో ఉండే అమోఘమైన మందులు శీఘ్రంగా గుణాన్నిచ్చి బాధను దురదను శమింపజేస్తాయి మల విసర్జనము ఎంతమాత్రము కష్టమనిపించదు.

గమనించండి సకాలంలో హెడెన్‌సా చికిత్స చేసుకుంటే ముమ్ముందు శస్త్రచికిత్స అవసరముండదు!

2 TG.A

రంటే ఎవరో- ఇంగ్లీషు మాత్రలంటే ఏమిటో-యింజెక్షన్ సూదులెలా వుంటాయో ఆనందరావు తన అనుభవంతో వాళ్ళకు వైద్యం చేయడం మొదలుపెట్టేవరకూ తెలియదు. వాళ్ళు తెలియనివాళ్ళుకదా అని- పీడించి పిండుకోవడంకూడా ఆనందరావుకు తెలియదు. వైద్యంతోబాటు ఆ చుట్టు ప్రక్కల బీదా బిక్కీ జనానికి సేవచేస్తూ మంచిపేరు తెచ్చుకున్నాడతను. అలా సేవ చేస్తూ ముందు- ముందు ఓ నాయకుడు అయిపోవాలని అతనెప్పుడూ అనుకోవడం లేదు.

నిజానికి "సేవ చేస్తాను' అన్నవాడే నాయకుడు అవుతాడుగాని సేవ చేసే వాడెప్పుడూ నాయకుడు కాలేడు. కావాలని అనుకోడు. అందుకే ఆనందరావూ కాలేదు. అతనికా దురుద్దేశ్యమూ లేదు.

"ఎప్పుడొచ్చావు?" అన్నాడు మామూలుగా నరసింహారావు.

"ఆరు గంటలకు వచ్చాను. అప్పటి నుంచీ నీకోసం ఇలా నిరీక్షిస్తూనే వున్నాను" అన్నాడు ఆనందరావు.

నిరీక్షణ అన్నమాట వినగానే నరసింహారావుకు నవ్వొచ్చింది. ఇప్పటివరకూ అప్పారావు కోసం తను నిరీక్షించి వస్తే ఇక్కడ తనకోసం ఆనందరావు నిరీక్షిస్తున్నాడు. ఇలా ఒకరికోసం ఒకరు నిరీక్షిస్తూ వుండటంలోనే ఈ లోకం 'నడుస్తుందా ?— "పుట్టిన పిల్లలు తల్లిపాలకోసం నిరీక్షణ— వయసొచ్చాక పెళ్ళికోసం నిరీక్షణ—రెండు బ్రతుకుల కలయికలో కన్న కలలు నిజం కావాలని నిరీక్షణ—పండిపోయాక పరలోక ప్రాప్తికోసం నిరీక్షణ—ఇది యింతేనేమో.. ఇలా అనంతంగా కొనసాగుతూనే వుంటుందేమో !" అనుకున్నాడు అతను.

"అలా పిచ్చివాడిలా నవ్వుతావేమిటి— ఇంతసేపు ఎక్కడున్నావు?" అన్నాడు ఆనందరావు.

"పనిమీద కాస్త ఆలశ్యమైందిరే అన్నయ్యా! లోపలకు రా" అన్నాడు నరసింహారావు.

ఆనందరావు అతన్తోపాటు లోపలకు వెళ్ళాడు. వాళ్ళు లోపలకు రాగానే ఇద్దరాడపిల్లలూ, తాయారు వెనగ్గదిలోకి వెళ్ళిపోయారు. చిట్టిబాబు జాడలేదు.

"నువ్వు మీ యింటి దగ్గర్నుంచేనా రావటం? శాంతి వాళ్ళంతా బాగున్నారా?" అడిగాడు నరసింహారావు.

"అంతా బాగానే వున్నారు. మా ఇంటి


* డైరెక్టుగా ఇంటర్ / డిగ్రీ / P. G.
* M. Ed., B. Ed., D. Ed., మరియు నర్సరీ టీచర్స్ ట్రైనింగ్.
* సాహిత్యరత్న / విశారద మరియు ఇతర హిందీ పరీక్షలకు.
* MBA / DBM., లైబ్రరీ సైన్స్ మరియు ఇతర డిప్లొమా కోర్సులకు

పోస్టల్/ఓరల్ శిక్షణ 'పాస్ గ్యారంటీ' ప్రాస్పెక్టస్ రు. 5/-

S. V. TUTORIALS,

బృందావన్ గార్డెన్స్, గుంటూరు-6.



బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి
లోధ్ర




PIN
కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్



నూతన యవ్వనం పొందండి ! సంతానవంతులు కండి !



చర్మ వ్యాధుల నుండి విముక్తులు కండి !

దురభ్యాసముల వలన కలిగిన నరముల బలహీనత, దాంపత్య సుఖము లేకపోవుట, సంతానము లేకపోవుట, సమస్త దీర్ఘ వ్యాధులకు అద్భుత ఆయుర్వేద చికిత్స ! పోస్టుద్వారా చికిత్స కలదు.

క్యాంపులు:— ప్రతి ఆదివారం "భీమవరం" షణ్ముఖ లాడ్జిలో ఉదయం 9 గం॥ నుండి సాయంత్రం 6-30 గం॥ వరకు.

ప్రతి నెల 1 మరియు 16 తేదీలలో "రాజమండ్రి" హోటల్ అప్సరలో మధ్యాహ్నం 12 గం॥ నుండి రాత్రి 9 గం॥వరకు.

డాక్టరు. డి. మార్కండేయులు, ఆయుర్వేదభిషక్

స్కిన్ స్పెషలిస్ట్, పార్కు రోడ్, గుడివాడ-521 301.
ఫోన్ : 523 హాస్పటల్, 540 నివాసం.



చెముడుకు చికిత్స

చెవిమంచి చీము కారుట, చెవిలో గడగడ శబ్దం, చెముడు లేదా చెవికి, సంబంధించిన ఏదేని అవ్యవస్థతపూర్తిగా నయం చేయబడును. ధర రు. 20/— పూర్తి కోర్సు రు. 50/—

Basanth Chikitsalaya(DFS)
3 P. O. Lalbigha (Gaya)

దగ్గర్నుంచి బయలుదేరి అప్పుడే ఆర్రోజులైంది. నిన్నటివరకూ నువ్వొస్తావని చూసి, నువ్వెందుకు రాలేదో తెలుసుకోవాలని మీ ఇంటివద్ద నుంచే యిలా వచ్చాను."

"నా కోసం చూశావా!" అన్నాడు ఆశ్చర్యంతో నరసింహారావు

"అలా ఆశ్చర్యపోతావు దేనికి....అర్జంటుగా రమ్మని నీకూ ఉత్తరం వ్రాశారటగా" అన్నాడు ఆనందరావు.

"ఉత్తరమా — నాకేం అందలేదన్నయ్యా" అన్నాడు నరసింహారావు.

"ఉత్తరం అందలేదూ? ఎక్కడో మారుమూల నున్న నాకే చేరిపోయిందే" అన్నాడు అనుమానాస్పదంగా అతడ్ని చూస్తూ ఆనందరావు.

"లేదు....అందలేదు .... అసలేం జరిగింది?"

అతనివైపు ఆయోమయంగా చూసి "ఎనిమిది రోజులక్రితం పెదనాన్నకు ఒకటే పనిగా వాంతులు, విరేచనాలు అయిపోయి ఒళ్ళు చల్లబడిపోయిందట వెంటనే కోలుకున్నారుగాని 'నా' అనే వాళ్ళందరినీ చూడాలని గొడవ చేస్తుంటే- ఆయన చూడాలనుకుంటున్న వాళ్ళందరికీ ఉత్తరాలు వ్రాశారట. అందరూ వచ్చి చూసి వెళ్ళడం కూడా జరిగింది. ఆయనకేమిటో చచ్చిపోతానన్న భయం పట్టుకొంది.ఇంకెన్నాళ్లు? ఇంకెన్నాళ్ళు? అంటున్నారు" అన్నాడు ఆనందరావు.

"ఇప్పుడెలా వుంది?" అన్నాడు గద్గదికమైన కంఠంతో ఆతృతగా నరసింహారావు.

"ప్రస్తుతం బాగానే వున్నట్టు కనిపిస్తున్నారు. అలా అని వెళ్ళడం మానేశావు గనుక. ఆయనదే పనిగా నిన్నే కలవరిస్తున్నారు. ఈ వేళొస్తావు. రేపొస్తావని నీకోసం ఎదురుచూస్తున్నారు. నరసింహానికి నామీద ప్రేమ నశించిపోయినట్టుందని నాతో చాలాసార్లు అన్నారు" అన్నాడు ఆనందరావు.

నరసింహారావు నేత్రాలు సజలాలైనాయి. పెద్దనాన్న గంభీర విగ్రహం అతని కళ్ళ ముందుకదులాడింది. ఆయన ఆనందరావుతో అన్నమాటలు అతనిలో తీవ్రమైన సంచలనాన్ని కలిగించేయి. 'పెదనాన్న అంటే తనకు ప్రేమలేదూ?' తన తల్లి చిన్నప్పుడే చనిపోతే. తండ్రి 'పెరాల్సిస్'తో ప్రక్కమీద పడుకొని తనకు పదేళ్ళు రాకుండానే పరమపదిస్తే 'వాళ్ళకు పెట్టేస్తున్నారో' అన్న పెద్దమ్మ పోరు పట్టించుకోకుండా ఆలనా పాలనా చూసి. దీక్షతో బాధ్యతతో తననొక ఇంటివాణ్ణి చేసి వదలిన పెదనాన్నమీద తనకు ప్రేమ నశించిపోవడమా? అతను పొంగుకొస్తున్న దుఃఖాన్ని బలవంతంగా నిగ్రహించుకొంటున్నాడు.


సిల్క్ ఆర్ట్స్ అపూర్వ రూపకల్పన
పూలు పళ్లు పొదిగిన
ఉగాది కార్డులు



మున్నెన్నడూ చూచి ఎరుగనివి
వినియోగదారులకు సెట్‌లు
ఉగాదిసెట్: 8 కార్డులు (పోస్టేజితో) రు. 16-00
వసంతవిలాసం సెట్: 8 కార్డులు (పోస్టేజితో) రు. 14-00
మనియార్డర్ గాని, పోస్టల్ ఆర్డర్ లుగాని పంపాలి ఇతరమేమీ అంగీకరించబడవు. వి. పి. పి. పంపే ప్రసక్తి లేనేలేదు.
డీలర్లకు మనవి: ఉచితంగా శాంపిల్స్ పంపలేము. షరతులకు వ్రాసి వివరాలు తెలుసుకోవలసిందిగా మనవి.
జానుతెనుగేమేము! జాతిఘనతేమేము!!
Cards Crafts Classics
8 State Bank Street
Post Box No. 2421 MADRAS-600 002
Phones: 84 07 92 & 84 90 29
SA/GC/83-20



త్వరలో వెలువడనున్నది!
వారం వారం 'ఆంధ్రజ్యోతి' పాఠకులను అలరించిన
ఘంటికోట బ్రహ్మాజీరావు నవల
'శ్రామిక శకటం'
నేడే మీ కాపీ రిజర్వు చేసుకోండి.
నవోదయ
నవోదయ పబ్లిషర్స్ - విజయవాడ-2 : గుంటూరు-2

ఆనందరావది గమనించి అతని భుజం తడుతూ "బాధపడకు తమ్ముడూ? ఉత్తరం అందనిదానికి నువ్వేం చెయ్యగలవు. తప్పు అందని ఉత్తరానిదేగాని నీది కాదుగదా— రేపు వెళ్ళమాసి రెండు రోజులుండిరా!" అన్నాడు.

నరసింహారావు మాట్లాడలేదు. 'అలాగే' అనికూడా అనలేదు.

"నీ పని ఎలా వుందిక్కడ?" అడిగాడు ఆనందరావు.

"నేనో ఉద్యోగమంటూ చేస్తున్నాను గనుక చెప్పడానికేమీలేదు. నువ్వు భోజనం చేశావా? మాటల్లోపడి మర్చేపోయాను. తాయారూ అన్నయ్యకు భోజనం పెట్టావా?" అన్నాడు భార్య నుద్దేశించి ఆ మాటైతే అన్నాడుగాని అసలు తాయారు వంటచేసిందో, లేదోనన్న భయం అతని గుండెల్ని పిండుతోంది.

"ఆయనకివేళ శనివారమటండీ! భోజనం చెయ్యనన్నారు. టిఫిన్ తేవడానికి లక్ష్మి వెళుతుంటే వద్దన్నారు" అంది లోపల్నుంచి తాయారు.

"ఇంకా నయం. లక్ష్మీ— వెళ్ళి టిఫిన్ తీసుకురా!" అన్నాడు తన జేబులో నయా పైస లేదని తెలిసీ నరసింహారావు.

"వద్దు తమ్ముడూ! ఆకలేస్తుంటే బస్సు దిగ్గానే మస్తుగా టిఫిన్ పట్టించి యిక్కడకు వచ్చాను. నా గురించి శ్రమతీసుకోకు. నేనికవెళతాను" అన్నాడు ఆనందరావు.

"అదేమిటి....ఎన్నాళ్లికో వచ్చి ఇప్పుడే వెళతానంటే ఎలా? రేపు వెళ్ళొచ్చులే" అన్నాడు నరసింహారావు

"నన్ను యిబ్బందిపెట్టకు. మరోసారి వచ్చినప్పుడు నువ్వెళ్ళిపొమ్మన్నా వుంటాను." అంటూ ఆనందరావు పైకి లేచి, జేబులోనుంచి రెండు అయిదు రూపాయల కాగితాలు తీసి, ఆడపిల్లల చేతిలో వుంచి "వెళుతున్నా"నని వాళ్ళతో చెప్పి బయటకు నడిచాడు.

"వుండమంటే వుండకుండా వెళుతున్నావు!" అన్నాడు నరసింహారావు. అతని అంతరంగంలో ఆనందరావు వెళ్ళిపోతున్నాడన్న బాధా వుంది, వెళ్ళిపోతే బాగుండును అన్న కోరికా వుంది.

"ఫర్వాలేదు. నేను వచ్చి అప్పుడే వారం రోజులైంది. అక్కడ వాళ్ళేలా వున్నారో" అన్నాడు ఆనందరావు సాలోచనగా. అతన్ని బలవంతంగా వుంచగలిగే శక్తి నరసింహారావుకు లేదు. మౌనంగా నడచి ఇద్దరూ రోడ్డుమీదికి వచ్చారు. "నువ్వు భోజనమైనా చెయ్యలేదు. మళ్ళా ఇప్పుడు నాకూడా బస్‌స్టాండుకు రావడం దేనికి? నేను వెళతాను. నువ్వు మాత్రం రేపు తప్పనిసరిగా పెదనాన్న దగ్గరకు వెళ్ళు" అని మరోసారి నరసింహారావును హెచ్చరించి ఆనందరావు వెళ్ళిపోయాడు.

నరసింహారావు భారంగా అడుగులేస్తూ వెనక్కు వచ్చేశాడు.

"బ్రహ్మంగారింట్లో బియ్యం తీసుకొని అన్నం వండాను. కూరేమీలేదు" అంది. అతన్ని చూడగానే తాయారు.

అతడామెవైపు చిరాగ్గా చూసేడు. చిత్రంగా నవ్వేడు. "తాయారూ! నాకు అన్నంవద్దు.... నున్నంవద్దు! మీరది తినో, త్రాగో పడుకోండి. కాస్సేపు నన్ను ప్రశాంతంగా వదిలేయండి!" అంటూ గది మూలనున్న చాప పర్చుకొని పడుకొన్నాడు.

తాయారుకు అతని చిరాకేమిటో అర్థం కాలేదు. అతన్నేదో అడగాలనుకొని- భయపడి వూరుకుంది.

నరసింహారావు మస్తిష్కం ఆలోచనలతో బద్దలౌతోంది. పెదనాన్న ఆనందరావుతో తనగురించి వెలిబుచ్చిన అభిప్రాయం పదేపదే గుర్తుకు వచ్చి అతన్ని బాధపెడుతోంది. ఎవరో దూరపు చుట్టాలంతా వచ్చి చూసి వెళ్ళినా తను వెళ్ళలేకపోయాడంటే ఆయనలా అనుకోవడంలో తప్పేముంది?

'రేపు వెళ్ళు' అంటూ ఆనందరావుతో ఒకటికి రెండుసార్లు చెప్పించుకున్నందుకు అతనికెంతో చిన్నతనంగా వుంది. నిజానికి రేపువెళ్ళగలిగితే అయిదారురోజుల క్రితమే వెళ్ళి వుండేవాడతను.

"బచ్చి బ్రతికానురా— అయినా బట్ట కట్టి తిరుగుతాననే నమ్మకంలేదు. నా మనసు నీ కోసం కలవరిస్తోంది. నా కళ్ళు నిన్ను చూడాలని తహ తహ లాడుతున్నాయి. ఒక్కసారి రా బాబూ" అంటూ పెదనాన్న ప్రేమను, ఆవేదనను అక్షరాల్లో యిమిడ్చి వ్రాయించిన ఉత్తరం అందుకొనీ సమయానికి పాతికరూపాయలు దారి ఖర్చులు లేక, తాకట్టు పెడితే పాతిక రూపాయలు వచ్చే వస్తువైనా యింట్లోలేక "మా యింట్లో రూపాయలచెట్టు లేదయ్యా!" అని అప్పులిచ్చేవాడితో అనిపించుకొనీ, పాతిక రూపాయలు పుట్టించలేని కారణంగా వెళ్ళలేకపోయినందుకు తానెంత కుమిలి పోతున్నాడో ఎవరికి తెలుస్తుంది?

తన అంతరంగంలో ఒక మహానదిలా ప్రవహిస్తున్న ప్రేమను వ్యక్తం చేసుకొనే అవకాశంలేక-సమస్యల సాలెగూళ్లో చిక్కుకొని కొట్టుకుంటూ—అందిన ఉత్తరాన్ని అందని ఉత్తరంగా—అందమైన అబద్ధంగా మార్చి చెప్పుకొనే హీనస్థితికి దిగజారిపోయిన ఈ జీవితం ఎందుకు? రేపు మనిషి చనిపోయినా ఇంతేనా?


తాను చనిపోతాననుకుంటూ....తనమీద ప్రేమను చంపుకోలేకపోతున్న పెదనాన్న- చిన్న కోరిక తీర్చడంలోకూడా తను చేతగానివాడైనా ప్రేమించకుండా వుండలేకపోతున్న భార్య....

ఈ చావులేని ప్రేమల మధ్య—ప్రేమ వుండీ నిరూపించలేకపోతున్న అసమర్థుడిగా తను బ్రతకడం అవసరమా? జీవితంలో ఘోరంగా ఓడిపోతూ తానెందుకు బ్రతకాలి?

అతనికి బ్రతుకుమీద చెప్పలేని విరక్తి పుట్టుకొస్తోంది. వ్యక్తం చేసుకోలేకపోయిన అతని ప్రేమ అశ్రుధారలుగా మారి చెంపల మీదుగా జారి క్రిందున్నున్న చింకి చాపను తడుపుతోంది!

అతని నిశ్శబ్దరోదన గమనించిన తాయారు నెమ్మదిగా వచ్చి అతని సరసన కూర్చొని "ఆనందరావు మీలో మరింత బాధను రగిలించినట్టున్నాడు! ఇంకెంత— మూడు రోజులేగా. జీతం అందుకోగానే వెళుదురుగాని— లేచి ఏ గంజి మెతుకులో కాస్త ఎంగిలిపడండి" అంది.

"తాయారూ...." అన్నాడు రుద్ధమైన



కంఠంతో నరసింహారావు.

"ఎందుకు బాధపడతారు? ఎందుకని అధైర్యపడతారు? జీవితంలో కొన్ని పరాజయాలు తప్పవు. అందుకని బాధపడుతూ కూర్చొంటామా? పడినగోడలు— ఎప్పుడూ పడినట్టే వుండిపోతాయా?? లేవండి .... నా మాట విని భోజనం చెయ్యండి!" అంది ప్రేమగా అతని భుజాలమీద చేతులువేసి పైకి లేవనెత్తుతూ తాయారు.

ఆమెకు బ్రతుకుమీదున్న ధైర్యానికీ, తన మీదున్న ప్రేమకూ అతను మరింత చలించిపోయేడు- ఉబ్బి ఎర్రనైన అతని నేత్రాలు చూసి ఆమె హృదయం విలవిలలాడింది.

అప్పుడే ప్రక్క పోర్షనులోవున్న గోడ గడియారం పదకొండు గంటలు కొట్టింది.

అదే సమయానికి గోల్డ్ మార్కెట్ సెంటర్లో కొచ్చిన అప్పారావుకు అక్కడ నరసింహారావు లేకపోవడంతో అంతులేని ఆగ్రహం వచ్చింది. ●

